క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ట



జలదంకి: మండలంలోని జమ్మలపాళెంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వంటేరు ప్రసాద్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈతముక్కల బాలమురళీరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

76.60 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



బట్టేపాడులో యిద్దలపూడి శీనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు 76.60 శాతం పింఛన్ల పంపిణీని వలంటీర్లు పూర్తి చేసినట్లు ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మొత్తం 5,010 మంది లబ్ధిదారులు ఉండగా, 3,838 మందికి నగదు అందజేసినట్లు వివరించారు.

దుప్పట్ల పంపిణీ



ఆత్మకూరురూరల్: వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీలోని గిరిజనులకు ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు, 2024 క్యాలెండర్లు పంపిణీ చేశారు. పాస్టర్లు నెహమ్యా, ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిశనగ విత్తనాల పంపిణీ

జలదంకి: మండలంలోని రైతులకు సబ్సిడీపై పచ్చిశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ బీ శైలజ బుధవారం తెలిపారు. జేజీ 11 రకం విత్తనాలు కిలో రూ. 81 కాగా, సబ్సిడీపై 48.60, కేఏకే-2 రకం కిలో 140.50 కాగా, సబ్సిడీపై రూ.84.30కు అందజేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ జెరాక్స్‌తో ఆర్బీకేల్లో వీఏఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

చీరల వితరణ



ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు గిరిజనకాలనీలోని మహిళలకు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు షేక్ సర్దార్, కేవీ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్లు సయ్యద్ నౌషాద్‌బేగం, శివకోటారెడ్డి, రాజశేఖర్, రాధిక, రమాదేవి, కామాక్షయ్యనాయుడు, నాయకులు సుబ్బారెడ్డి, ముజ్జు, చిన్నపరెడ్డి, వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర్లు, రసూల్ బాషా, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

22 మందికి కంటి ఆపరేషన్లు



ఆత్మకూరురూరల్: భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి దాతృత్వంతో ఆయన స్వగ్రామమైన మహిమలూరులో శంకర నేత్రాలయ వారు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరంలో బుధవారం 22 మందికి కంటి ఆపరేషన్లు చేశారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరంలో 552 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 120 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ణయించినట్లు శంకర నేత్రాలయ డాక్టర్ అరూల్‌కుమార్ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర మహిమ చారిట్రబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మహిమలూరు శ్రీనివాసులు, నిజమాల నరసింహులు, మద్దినేని రవితేజ, హరీష్, తదితరులు సేవలు అందించారు.

అచీవ్‌మెంట్ సర్వే పరీక్షపై అవగాహన



ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్, గండిపాళెం జెడ్పీ, ప్రాథమిక, గురుకుల పాఠశాలల్లోని 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ నెల 3న నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షపై ఎంఈఓ తోట శ్రీనివాసులు బుధవారం అవగాహన కల్పించారు.

అమరజీవి త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్రం



కావలి: అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా కావలిలో శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి బుధవారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీపొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. అనంతరం 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్ర విలీనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. 2014లో తెలంగాణ విడిపోయాక నవ్యాంధ్రప్రదేశ్‌కు నాడు సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిలిపేసి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని చెరిపేయాలని చూశారని ఆరోపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రావతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అమరజీవి త్యాగఫలం, ఎంతో మంది పోరాట ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి అందించాలనే సమున్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, డేగా రాముయాదవ్, వీఎంఎస్‌ఆర్ మాలి, మునీర్, నందనవనం సీతామహాలక్ష్మి, కుందుర్తి శ్రీనివాసులు, పానుగోటి అనురాధ, కనుపర్తి రాజశేఖర్, దామిశెట్టి సుధీర్ నాయుడు, బండారు మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పంచాయతీ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీజేవైఎం మండలాధ్యక్షుడు వంటేరు రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జలదంకి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, మండల ఆర్య వైశ్య సంఘ నేతలు జనార్దన్, రమేష్, మురళి, మనోహర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సంగం తహసీల్దార్ కార్యాలయంలో..



సంగంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు

- మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు.

సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి తహసీల్దార్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే తెలుగు వారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘ నేతలు వేమా మల్లికార్జునరావు, అనిల్, రాజా, గిరి, తదితరులు ఉన్నారు.

చేజర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి చిత్ర పటానికి ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిందన్నారు. అమరజీవిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, బోడిపాడు సర్పంచ్ బీ బలరామిరెడ్డి, చేజర్ల ఉపసర్పంచ్ ఉడతా పుల్లయ్య, చినహజరత్‌బాబు, సుధీర్, పీ రత్నారెడ్డి, వంగవరపు ఆనంద్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి తహసీల్దార్ ఆనందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు. ఆయన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆర్‌ఐ సురేంద్ర, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు హెచ్‌ఎం పద్మావతి, మర్రిపాడు గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు పూలమాలలు వేశారు. అమరజీవి త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం తపాల బిల్లను విడుదల చేసిందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, నెల్లూరు జిల్లాకు ఆయన పేరును నామకరణం చేశారని వివరించారు. ప్రతిఒక్కరూ శ్రీరాములు త్యాగనిరతిని వృథా చేయకుండా తెలుగుభాషాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లూరు నగర పంచాయతీ కార్యాలయంలో..



మర్రిపాడు ఉన్నత పాఠశాలలో..



మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయంలో..



చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో..



జలదంకి బస్టాండ్ సెంటర్లో..

9న కావలిలో సామాజిక సాధికార యాత్ర

కావలి: వైఎస్సార్‌సీపీ 'సామాజిక సాధికార యాత్ర'ను ఈ నెల 9న కావలి నియోజకవర్గంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌పై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం చర్చించారు. పోలీసులతో చర్చించి రూట్ మ్యాప్‌పై నిర్దిష్టమైన అభిప్రాయానికి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు.

వింజమూరు సీహెచ్‌సీకి డయాలసిస్ కేంద్రం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి కిడ్నీ డయాలసిస్ కేంద్రం మంజూరైనట్లు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వింజమూరు, కలిగిరి, కొండాపురం, దుత్తలూరు, వరికుంటపాడు, జలదంకి, ఉదయగిరి, తదితర మండలాల కిడ్నీ రోగులకు డయాలసిస్ కేంద్రం ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. గతంలో సీహెచ్‌సీ తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయించారని తెలిపారు. త్వరలోనే కలెక్టర్ చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండల ప్రజలు జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎంఈఓ తనిఖీలు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ -2 చలపతి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, జగనన్న గోరుముద్ద అమలు, పాఠ్యాంశాల బోధన, తదితర అంశాలపై విద్యార్థులను ఆరాతీశారు.

పరామర్శ

సోమశిల: అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి తండ్రి బట్రెడ్డి తిరుపాల్‌రెడ్డి ఉత్తరక్రియలు బుధవారం జరిగాయి. పలువురు ప్రముఖులు హాజరై బట్రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రముఖ కాంట్రాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి

ఉదయగిరి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండిపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ, గ్రామ దత్తత దాత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి సచివాలయం ఏర్పాటు చేయించాలని, చేపల కేంద్రం ఖాళీ స్థలాన్ని జగనన్న లేఅవుట్‌కు కేటాయించేలా చూడాలని, ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మేకపాటి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మేకపాటి మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. "సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి నిర్ణీత సమయంలో పథకాలను ప్రజలకు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని తెలిపారు. ఫలితంగానే తాము ధైర్యంగా గడప గడపకు వెళ్లగలుగుతున్నామన్నారు. నియోజకవర్గంలో 32 సచివాలయ పరిధిలో తాను తిరిగానని, ప్రతి గడపలో ప్రజలు ఆదరించి అభిమానిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం 2024లో జరిగే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,, గండిపాళెం జలాశయాన్ని సందర్శించారు. ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు జీ కల్పన, ఎం తిరుపతయ్య, కే కృష్ణ, కే వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జీ ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు పీ రమణయ్య, ఏ వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలే వినయ్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు మూలె సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు జీ శ్రీనివాసులురెడ్డి, జీ వెంగళ్‌రెడ్డి, తిరుపతి, రియాజ్, బాషా, అక్కుల్‌రెడ్డి, అబ్దుల్‌రజాక్, గపూర్, రాజా, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రేపు సహకార బ్యాంకు ప్రారంభం



మాట్లాడుతున్న సీఈఓ సరిత

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని బస్టాండ్ సెంటర్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నట్లు సహకార బ్యాంకు సీఈఓ సరిత తెలిపారు. బుధవారం బ్యాంకు ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకార బ్యాంకు శాఖను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. బ్యాంకు ద్వారా పంట, గృహ, వాణిజ్య అవసరాలకు రుణాలను అందించనున్నట్లు వివరించారు. లాకర్ సౌకర్యంతో పాటు ఏటీఎం సేవలను సైతం అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బ్యాంకును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీయం ఉషారాణి, డీజీయంలు మధుసూధన్‌రావు, దయాకర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్లు సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అనుమతించొద్దు



ఆత్మకూరురూరల్: పట్టణంలోని సోమశిలరోడ్ సెంటర్‌లోని అనధికార కట్టడాలు, భవన నిర్మాణాలకు మున్సిపల్ అనుమతులు ఇవ్వవద్దని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సోమశిల రోడ్డు సెంటర్ పట్టణానికి నడిబొడ్డున ఉండడమే కాకుండా 50 గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రధాన కూడలిగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. ఆక్రమణదారులు శాశ్వత కట్టడాలు నిర్మిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ విషయమై పాలకవర్గంతో చర్చించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, తిరుపతమ్మ, వేణు, శ్రావణ్‌కుమార్, చెరుకూరు కామాక్షయ్య నాయుడు, మొలబంటి రాజశేఖర్, వివిధ వార్డుల ఇన్‌చార్జిలు కొప్పోలు చిన్నపరెడ్డి, చైతన్య, చిన్న కొండ, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ దేవసేన

ఆత్మకూరురూరల్: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మినుము పంట సాగుకు సమయం మించిపోయిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేన వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ఆత్మకూరులోని ఏడీఏ కార్యాలయంలో రబీ సాగుకు సన్నద్ధతపై ఏఓలు, విస్తరణాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుముకు ప్రత్యామ్నాయంగా నవంబరు 15లోగా పెసర పంట సాగు చేయవచ్చని తెలిపారు. డిసెంబరులో నువ్వు పంట విత్తుకోవచ్చునని చెప్పారు. అక్టోబరు 17 నుంచి రబీ సీజన్ మొదలైనందున వరి నార్లు పోసుకునే వీలున్న రైతులు ఎన్‌ఎల్‌ఆర్ 34449, ఎన్‌ఎల్‌ఆర్ 3354, ఆర్‌ఎన్‌ఆర్ 1508 రకాల ధాన్యాలను పోసుకోవచ్చునని తెలిపారు. నవంబరు నుంచి డిసెంబరు వరకు శనగ, పొగాకు పంటలను సాగు చేయవచ్చని వివరించారు. ఆర్బీకేల్లో శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు.

తీరనున్న దాహార్తి



దగదర్తి (కావలి): దగదర్తి మండలం చవటపుత్తేడు ఎస్సీ కాలనీవాసుల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కాలనీకి పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండగా సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాలనీలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని బోర్లు వేసే ప్రయత్నాలు చేసినా నీరు పడలేదు. దీంతో గతకొన్నేళ్లుగా కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు కాలనీకి వెళ్లి నూతన బోరు నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. రిగ్‌తో బోరు నిర్మాణ పనులు ప్రారంభించిన కొద్దిసేపటికే నీరు పడడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దాడి

కావలి: పట్టణంలోని జనతాపేట నార్త్‌ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సోమినేని మురళీకృష్ణపై అదే అపార్ట్‌మెంట్‌కు చెందిన టీడీపీ నాయకుడు పులివర్తి రవీంద్ర బుధవారం దాడికి పాల్పడ్డాడు. బాధితుడి వివరాల మేరకు..సోమినేని మురళీకృష్ణ అపార్ట్‌మెంట్‌లోని ఐదో ఫ్లోర్‌లో ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో మూడో ఫ్లోర్‌లో టీడీపీ నాయకుడు పులివర్తి రవీంద్ర ఉంటున్నాడు. బుధవారం అకారణంగా తనపై పులివర్తి రవీంద్ర దాడికి పాల్పడ్డాడని మురళీకృష్ణ డయల్ 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేశాడు. టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలెపాటి సుబ్బానాయుడు తన చుట్టమని, మా ప్రభుత్వం వస్తే నీ సంగతి తేలుస్తానని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దేవస్థానానికి రూ.50వేల నగదు విరాళం

మర్రిపాడు: మండలంలోని సన్నువారిపల్లిలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ, అంకాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొని ఆలయానికి రూ.50వేలు విరాళం అందజేశారు. అలాగే భీమవరం సొసైటీ చైర్మన్ మాధవరెడ్డి ఆలయానికి రూ.18 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు శ్రీకొలను విద్యార్థులు



నవ్య, రిషితను అభినందిస్తున్న హెచ్‌ఎం

అనుమసముద్రంపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు శ్రీకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీ నవ్య, ఏ రిషిత ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్ నిరంజన్ బుధవారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో రాణించి అండర్-17 హాకీ జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే 67వ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పీ థామస్‌పీటర్‌ను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ మాధవరెడ్డి అభినందించారు.

దర్గా స్థలాల పరిశీలన



దర్గా స్థలాలను పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని హజ్రత్ సుల్తాన్ షహీద్ ఔలియా దర్గాకు సంబంధించిన స్థలాలను వక్ఫ్‌బోర్డు అధికారులు ఖుదావస్, వహబ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాకు సంబంధించి సోమశిల రోడ్డు పరిసరాల్లో సర్వే నంబరు 848లో 1.41 ఎకరాలు, ఉలవదిబ్బలోని సర్వే నంబరు 844లో 3.70 ఎకరాలు, ఎల్‌ఆర్‌పల్లిలో సర్వే నంబరు 852లో 2.35 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. దర్గా స్థలాల ఆక్రమణపై ఫిర్యాదులు అందడంతో పరిశీలించామని చెప్పారు. దర్గా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరైనా అతిక్రమించి దర్గా స్థలాల ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు రహీం, మసీదు ఇమామ్ హమురుజ, దర్గా ముజావర్లు హాలీం, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

జీవాల దొంగల అరెస్ట్

మర్రిపాడు: గ్రామాల్లో జీవాలను అపహరించుకెళ్తున్న నలుగురు దొంగలను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. గత కొన్నిరోజులుగా మండల పరిధిలోని ముంబై జాతీయ రహదారి వెంబడి గ్రామాల్లోని పలువురు రైతులకు చెందిన పొట్టేళ్లు, గొర్రెలను దొంగలు అపహరించుకెళ్తున్నారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిఘా ఉంచారు. గత రెండ్రోజుల క్రితం బ్రహ్మణపల్లి సమీపంలో పొట్టేళ్లు, గొర్రెలను తోలుకెళ్తున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన నలుగురు వ్యక్తులు జీవాల దొంగతనానికి పాల్పడుతున్నట్లుగా తెలుసుకుని బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం దొంగలను కోర్టుకు హాజరుపరిచారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కావలి: పట్టణంలోని వాయునందన ప్రెస్‌వీధికి చెందిన పెద్దవరప మల్లికార్జున (60) అనారోగ్యంతో బుధవారం తన ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కావలి వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.